క్లుప్తంగా

పదోన్నతి పొందిన ఏబీఎంకు సన్మానం



తిరువూరు: స్థానిక భారతీయ జీవిత బీమా సంస్థ శాటిలైట్ కార్యాలయంలో సహాయ బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందిన శ్రీమన్నారాయణను శనివారం ఏజెంట్లు, సిబ్బంది సత్కరించారు. గుల్బర్గా శాఖకు బదిలీపై వెళుతున్న శ్రీమన్నారాయణ తిరువూరు శాఖలో ఏజెంట్లకు, పాలసీదారులకు విశిష్ట సేవలందించారని బ్రాంచి మేనేజరు రమేష్ అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన శ్రీమన్నారాయణ మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతల సమావేశం

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం సాయంత్రం జరుగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగే సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ముఖ్య నాయకుల సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చర్చ జరుగుతుందని చెప్పారు.

ఆర్థికసాయం అందజేత



తిరువూరు: స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఒక హోటల్ యజమాని కుటుంబానికి తిరువూరు గుళ్లపల్లి ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గుళ్లపల్లి వెంకటరత్నం, గద్దె వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి రూ.50 వేల ఆర్థికసాయాన్ని హోటల్ నిర్వాహకులకు అందజేశారు.

యోగా సాధనతో ఆరోగ్యం



ఇబ్రహీంపట్నం: యోగా సాధనతో ఆధ్యాత్మికత, ఆరోగ్యం సిద్ధిస్తుందని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు, యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏ కాలనీ ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఆధ్యాత్మిక క్రమశిక్షణకు యోగా ఒక సాధనమని చెప్పారు. యోగా సాధన ద్వారా అనేక వ్యాధులు నయం అవుతాయన్నారు. మానవ శరీరం, మనస్సును సమన్వయం చేయడంలో యోగా పనిచేస్తుందన్నారు. సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం వంటివి సాధన చేయించారు. ఎన్టీటీపీఎస్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ఆగిరిపల్లి: గోవుల పోషణార్థం పశుగ్రాసాన్ని ఉచితంగా అందించడం అభినందనీయమని ఆగిరిపల్లి వేద పాఠశాల కార్యదర్శి సూరి శర్మ అన్నారు. ఈదులగూడెంకు చెందిన నాయుడు రాము శనివారం ఆగిరిపల్లి వేద పాఠశాలలోని గోవులకు రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వితరణగా అందజేశారు. వేద పాఠశాల కార్యదర్శి సూరి శర్మ, సిబ్బంది దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

17 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరు రోడ్డు, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, ట్యాలీ కోర్సులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి కోర్సుకు 2 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. అతి తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన విద్యను గత 8 సంవత్సరాలుగా వేలాది మందికి అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, గృహిణులు, జాబ్ చేస్తున్న వారు ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా ఈ కోర్సులు నేర్చుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి కలవారు తమ కార్యాలయంలో లేదా 73821 93413, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలా శర్మ ఆధ్వర్యంలో శనికి ప్రత్యేక తైలాభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

అడ్మిషన్ల పెంపుపై దృష్టి

- ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంపు లక్ష్యంగా మనబడి
- అంగన్‌వాడీ చిన్నారుల చేరికలపై ఫోకస్



కేతనకొండలో పునఃప్రారంభానికి ముస్తాబైన ఎంపీపీ పాఠశాల

ఇబ్రహీంపట్నం: వేసవి సెలవులు ఈనెల 11తో ముగియనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 12 నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల పెంపునకు మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మన బడి కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేశారు. మండలంలోని ఐదు జెడ్పీ పాఠశాలలు ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 65 శాతం ఉత్తీర్ణతపై ప్రచారం చేస్తున్నారు. 32 ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల్లో గత ఏడాది సుమారు ఆరు వేల మంది విద్యాభ్యాసం చేశారు. ఈ ఏడాది వారి సంఖ్య భారీగా పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం సమకూర్చిన స్టడీ మెటీరియల్, యూనిఫామ్ తదితరాలను ఆయా పాఠశాలలకు చేర్చారు.

హాజరుశాతం పెంపే లక్ష్యం

మండల పరిధిలోని గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ బిడ్డలను చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లా విద్యా శాఖాధికారుల సూచనలతో ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మనబడి బాధ్యతను గుర్తు చేస్తూ విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు విశ్వప్రయత్నాలు ప్రారంభించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది విద్యార్థులు సాధించిన పురోగతిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలతో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నారు. కొండపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థి పి.అనిల్‌కుమార్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 582/600 మార్కులు సాధించాడు. మిగిలిన వారు 540 నుంచి 568 వరకు మార్కులు సాధించారు. వారి వివరాలు పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై అవగాహన కల్పిస్తున్నారు.



మూలపాడులో మనబడి కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్పీ స్కూల్ హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ తదితరులు

అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి

మండలంలో ప్రీ స్కూల్స్ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన చిన్నారులు 897 మంది ఉన్నారు. వీరిలో ఐదేళ్లు నిండిన చిన్నారులు 152 మంది ఉన్నారు. వీరిని ఈ ఏడాది తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల నుంచి చిన్నారుల వివరాలు సేకరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో యూకేజీ చదువుతున్న చిన్నారులు సుమారు 1,500 మంది వరకు ఉన్నారు. వీరిని కూడా ఎంపీపీ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్చేందుకు తల్లిదండ్రులతో చర్చలు జరుపుతున్నారు. వీరితో పాటు ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులను జెడ్పీ పాఠశాలల్లో చేర్చేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గతానికి భిన్నంగా అన్ని సదుపాయాలు ఉన్నాయి. తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశాం. బుక్స్, యూనిఫామ్, షూస్, బ్యాగ్, మధ్యాహ్నం భోజనం, మినరల్ వాటర్ తదితరాలు ఉచితంగా అందిస్తున్నాం. డిజిటల్ విద్య అందుబాటులో ఉంది. ఈ ఏడాది ఎక్కువ మందిని పాఠశాల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం.

– సీహెచ్ పుష్పలత, ఎంఈఓ, ఇబ్రహీంపట్నం

పట్టుదలతో అభివృద్ధి సాధించాలి

- జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు
- ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

మైలవరం: విద్యార్థులు ఏ కోర్సు చదివినా కృషి, పట్టుదలతో అభివృద్ధి సాధించాలని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తోందన్నారు. యువ గ్రాడ్యుయేట్‌లను సమాజానికి అందించడంలో సహాయ పడుతోందని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేస్తున్న అధ్యాపకులను, కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన మైక్రోసాఫ్ట్ ఇన్ డేటా అండ్ ఏఐ ప్రాక్టీస్ సీనియర్ డైరెక్టర్ టి.సురేంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఇచ్ఛా శక్తి, జ్ఞాన శక్తి, క్రియా శక్తి అవసరమన్నారు. ఇచ్ఛా శక్తి తల్లిదండ్రుల ద్వారా, జ్ఞాన శక్తి గురువుల ద్వారా వస్తుందని చెప్పారు. మిమ్మల్ని మీరు ప్రూవ్ చేసుకునేందుకు క్రియా శక్తి చాలా అవసరమన్నారు. కళాశాల కోఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాద్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఇంజినీరింగ్‌లో వివిధ శాఖలకు చెందిన 780 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. కళాశాల టాపర్ కె. వెంకట సాయి సుప్రజకు లకిరెడ్డి బాలిరెడ్డి గోల్డ్ మెడల్, రూ.25,000 నగదు అందజేశారు. మరో 8 మందికి సిల్వర్, 8 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం

నూజివీడు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నియోజకవర్గంలో ప్రజలు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. పేదలు, వ్యవసాయ కూలీలకు సైతం వ్యవసాయ పనులు సాగితేనే కూలి దొరుకుతుంది. గత కొన్ని రోజులుగా వాతావరణం మారి మబ్బులు కమ్ముకుని అడపాదడపా వర్షపు జల్లులు పడుతున్న నేపథ్యంలో ఈ ఏడాది పంటల సాగుపై రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. రైతులు తమ పంట భూములను దుక్కులు దున్నిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న మామిడితోటలు ఈ ఏడాది కాయకపోవడంతో రైతులకు ఆదాయం లేకుండా పోయింది. నియోజకవర్గంలోని చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు మండలాల్లో ఖరీఫ్‌లో ముఖ్యంగా వరి పంటను రైతులు సాగు చేస్తారు. అలాగే నూజివీడు, ముసునూరు మండలాల్లో వరి పంటతో పాటు పత్తి, మొక్కజొన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి వ్యవసాయ భూమి విస్తీర్ణం దాదాపు 95 వేల ఎకరాల వరకు ఉంది. పంటల సాగుకు ప్రధాన నీటి వనరు వర్షం నీరే. వర్షాలు సమృద్ధిగా పడి నియోజకవర్గంలోని చెరువులు సకాలంలో నిండితే పంటల సాగు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాగుతుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 24,400 వ్యవసాయ బోరులు కూడా ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే ఈ బోర్ల కింద మాత్రమే పంటలు సాగవుతాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సిద్ధంగా ఉంచాల్సిన అవసరం ఉంది.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్న రైతు

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం..

అదను, పదును ఒకేసారి వస్తే రైతులు విత్తనాలకు ఎగబడే అవకాశం ఉన్న నేపథ్యంలో విత్తనాల డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత సరిగా మొలకలు రాక పంటను సాగు చేయలేక చేతులెత్తేసే పరిస్థితులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు నడుచుకుంటే మరింత లాభదాయకంగా ఉంటుంది.

అమ్రితసాయిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థినికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు



అమ్రితసాయి విద్యార్థులతో వీసీ ప్రసాదరాజు, కళాశాల యాజమాన్యం

కంచికచర్ల : పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీకే ప్రసాదరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వీసీ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు మానవతా విలువలు, సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఇంజినీరింగ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కరిక్యులమ్ నిర్వహిస్తోందంటూ అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రెసిడెంట్ కె.లక్ష్మీ కార్తీక్ మాట్లాడుతూ 2020–24 అటానమస్ బ్యాచ్‌లో 454మంది విద్యార్థులు ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా పొందారని, వీరందరికీ ప్రొవిజనల్స్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ప్లేస్‌మెంట్స్‌లో 243మంది ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఆఫర్లతో రూ.12లక్షల అత్యధిక వార్షిక వేతనంతో తమ విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. అనంతరం సీఎస్‌సీ బ్రాంచి నుంచి కాలేజీ టాపర్‌గా నిలిచిన ఎం.మృదులతోపాటు, ఆయా బ్రాంచీల టాపర్లుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్‌తోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాలనీలో ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బ్లాక్ నంబర్ 96లో మహంకాళి వెంకన్న కుటుంబం నివాసం ఉంటోంది. లారీ డ్రైవర్‌గా పని చేసే వెంకన్న ఈ నెల 2న తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ ఎబినేజర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షులుగా రెవరెండ్ ప్రభుదాసు, అధ్యక్షునిగా నకిరికంటి జోసఫ్ కిరణ్, కార్యదర్శి, కోశాధికారులుగా కరిసె రవికుమార్, హనోక్‌నాయక్, సంయుక్త కార్యదర్శి, ఉపకోశాధికారులుగా బి.చంద్రపాల్, కేజే.హెన్రీ, ఉపాధ్యక్షులుగా కె.అశోక్, కె.ఆశీర్వాదం, డి.ఆనందరావు, గౌరవ సలహాదారులుగా బీవైసీ సాల్మన్ ప్రసాద్, జి.దేవసహాయం, ప్రతాప్, కోఆర్డినేటర్లుగా డేనియల్ ఎజ్రాశాస్త్రి, శామ్యూల్ నిరీక్షణ, జాన్ రమ్యబాబు, ఎల్.ప్రవీణ్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

క్రీడలతో చిన్నారుల్లో మానసికోల్లాసం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): క్రీడలతో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని విజయవాడ రైల్వే ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ అన్నారు. విజయవాడ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు శనివారం రైల్వే మినీ స్టేడియంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఆర్ఎం పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చిన్న వయస్సు నుంచే పోటీతత్వం, టీం వర్క్ అలవడుతుందన్నారు. క్యాంప్‌లకు తమ పిల్లలను పంపించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అనంతరం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందిన 68 మంది పిల్లలకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర్ బి.టి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన చిన్నారులతో రైల్వే అధికారులు

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరమని రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల అన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, లక్షణాలు, చికిత్స తదితరాలను వివరించారు. పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి బ్రెయిన్ ట్యూమర్ నివారణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, ఏఓఐ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్, డాక్టర్ హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలి : ఎస్ఐ

వీరులపాడు: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని నడుచుకోవాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలుంటాయన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని వివరించారు. ముఖ్యంగా నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. అల్లర్లు, ఘర్షణ వాతావరణం సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న కుర్రా హేమచంద్ర



సమావేశానికి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

సిద్ధార్థలో ఘనంగా ప్లేస్‌మెంట్స్ డే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని ఏడీపీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ కుర్రా హేమచంద్ర అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల శిక్షణా ఉపాధి విభాగం ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్స్ డే వేడుకలు కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో శనివారం జరిగాయి. కార్యక్రమానికి హేమచంద్ర ముఖ్య అతిథిగా హాజరై కళాశాల తరగతి గది నుంచి కార్పొరేట్ కంపెనీలోకి అడుగు పెట్టబోతున్న యువతను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి జీవితం నుంచి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులుగా చేరబోతున్న విద్యార్థులు పాటించాల్సిన 10 సూత్రాలను వివరించారు. వృత్తి నైపుణ్యం, భావవ్యక్తీకరణ నైపుణ్యం, సమయపాలన, మార్పులకు అనుగుణంగా తమని తాము మలచుకోవడం, సమస్యల పరిష్కార నైపుణ్యం, వృత్తి జీవితం–కుటుంబ జీవితం మధ్య సమతుల్యత, నిరంతర అధ్యయనం, వృత్తి పరిచయాలు, ఆర్థిక నిర్వహణ– క్రమశిక్షణ, కార్పొరేట్ మర్యాదలు వంటి 10 సూత్రాలు జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోడానికి దోహదపడతాయన్నారు.

280 మంది ఎంపిక..

కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యా బోధనతో పాటు పరిశ్రమల అనుసంధానంతో తమ కళాశాలలో చదువుకున్న వారిలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. 2023–24 విద్యా సంవత్సరంలో 40 సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఇప్పటి వరకు 280 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, డిగ్రీ ద్వితీయ సంవత్సరం నుంచి జీవన నైపుణ్యాలు, ఆంగ్ల భాష నైపుణ్యం, సమస్యల పరిష్కార నైపుణ్యాల్లో ప్రణాళికాబద్ధమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ.. ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులందరూ నైతిక విలువలు, క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఆ కంపెనీల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని అకాంక్షించారు. భవిష్యత్తులో కళాశాలకు అందుబాటులో ఉంటూ తమ పరిధిలో గల ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక శిక్షణ వంటి సమాచారం అందజేయడం ద్వారా విద్యార్థులకు సహాయపడాలని చెప్పారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమల భాగస్వామ్యం, శిక్షణ ఉపాధి విభాగం మెరుగైన పనితీరు, కళాశాల యాజమాన్య సహకారం ప్రాంగణ ఎంపికల్లో విజయానికి కారణాలని చెప్పారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను శిక్షణ ఉపాధి విభాగ అధికారి కావూరి శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ రాయల శ్రీనివాసరావు, ఎస్.రాజేష్, బి.సాయిరాం, శ్యాంబాబు అభినందించారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



గద్దె రామ్మోహన్‌ను కలిసిన రేషన్ డీలర్లు

పటమట(విజయవాడతూర్పు): ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. తూర్పు నియోజకవర్గంలోని రేషన్ డీలర్లు శనివారం అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే గద్దె కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీలర్లు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం అయిన తర్వాత దీనిపై చర్చిద్దామని గద్దె స్పష్టం చేశారు. రేషన్ డీలర్ మేడిశెట్టి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, శివప్రసాద్, ఆంజనేయులు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.